సాక్షి వరంగల్
శనివారం । 11 । నవంబర్ । 2023



అరుదైన శస్త్రచికిత్స

కేఎంసీలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో న్యూరోసర్జరీ విభాగంలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు పరిపాలన అధికారులు తెలిపారు. - IIలో▸



హత్య కేసు నిందితుల అరెస్ట్

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని జానకీపురంలో కోట లక్ష్మణ్‌ను హత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. - IIలో▸

గరిష్టం/కనిష్టం
$32^0/20^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది. రాత్రి వేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు

నెక్కొండ : దీపావళి పర్వదినం సందర్భంగా నెక్కొండ వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి సీహెచ్.కృష్ణమీనన్‌రావు తెలిపారు. మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 11న రెండో శనివారం, 12న ఆదివారం, 13న సోమవారం అమావాస్య కావడంతో సెలవులు ఇచ్చామని పేర్కొన్నారు. తిరిగి 14న మార్కెట్ పునఃప్రారంభమై, క్రయవిక్రయాలు కొనసాగుతాయని తెలిపారు. రైతులు, వ్యాపారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలి



సంగెం: న్యాయసేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఆర్.సురేష్ సూచించారు. తీగరాజుపల్లి కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, పిల్లలకు న్యాయసేవాధికార సంస్థ అండగా ఉంటుందని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ యాక్ట్, వివాహ సంబంధిత, మహిళా చట్టాలు, భూ చట్టాలపై అవగాహన కల్పించారు. సదస్సులో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఆర్.రజిని, సర్పంచ్ కర్నుగుత్త రమాగోపాల్, పారా లీగల్ వలంటీర్లు రమాదేవి, వెంకటేష్, విజయ గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



వర్ధన్నపేట : విద్యార్థులు ఇష్టంతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వరంగల్ ఎంజీఎం డాక్టర్ పి.సమ్మయ్య సూచించారు. సమ్మయ్య తన తల్లిదండ్రులు పోరళ్ల సమ్మక్క -వెంకటయ్య జ్ఞాపకార్థం వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలనిధి పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రాపాక సదానందం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. దాతల ప్రోత్సాహకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పోరళ్ల రవీందర్, ఉపాధ్యాయులు సదానందం, రమణారావు, అనిల్, తాటిపాముల రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేఎంసీలో వైట్ కోట్ వేడుకలు

ఎంజీఎం: కాకతీయ మెడికల్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే, వైట్ కోట్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీంతో పాటు హిపోక్రేటిక్ ప్రమాణం, ఫ్రెషర్స్ డేను ఘనంగా జరుపుకున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ పేర్కొన్నారు. ఈసందర్భంగా కేఎంసీ క్రానికల్ కాలేజ్ మ్యాగజైన్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డి, టీబీ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, ఆర్ఈహెచ్ సూపరింటెండెంట్ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న వరద ముంపు
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ప్రధానసమస్య

పరకాల అసెంబ్లీ బరిలో 'గ్రీన్‌ఫీల్డ్' బాధితులు

సెల్ఫీతో అవగాహన

జంగ్ తెలంగాణ

హోర్డింగ్ కనిపించ లేదా.. కోడ్ వర్తించదా..?

- వివరాలు IIలో▸

ముగిసిన నామినేషన్ల స్వీకరణ



నర్సంపేట : బీఆర్ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి తరఫున నామినేషన్ వేస్తున్న ఆయన సతీమణి పెద్ది స్వప్న



నర్సంపేట : కాంగ్రెస్ అభ్యర్థి దొంతి మాధవరెడ్డి తరఫున నామినేషన్ వేస్తున్న తక్కళ్లపల్లి రవీందర్‌రావు



నర్సంపేట : రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభంపాటి పుల్లారావు

చివరి రోజు భారీగా దాఖలు చేసిన అభ్యర్థులు
- వరంగల్ తూర్పులో మొత్తం 51, నర్సంపేటలో 39, వర్ధన్నపేటలో 40
- ఆయా కార్యాలయాల వద్ద సందడి

నర్సంపేట/వర్ధన్నపేట/వరంగల్ అర్బన్ : జిల్లాలో శాసనసభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ శుక్రవారం ముగిసింది. వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో ఈనెల 3 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. చివరి రోజు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు, పలువురు స్వతంత్రులు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థులు, పార్టీల నాయకులు, స్వతంత్రుల మద్దతుదారులు, కార్యకర్తలతో ఆర్‌ఓ కార్యాలయాల వద్ద సందడి నెలకొంది.

నర్సంపేటలో..

నర్సంపేటలో చివరి రోజు 20 నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి కృష్ణవేణికి అందజేశారు. గడ్డం ఆంజనేయులు (బీజేపీ) రెండు సెట్లు, మొగిలిచర్ల సందీప్ (స్వతంత్ర), బానోత్ శ్రీను డీఎస్పీ, గుండాల మదన్‌కుమార్ బీఎస్పీ, ఇమ్మడి బాబు (స్వతంత్ర), పెద్ది సుదర్శన్‌రెడ్డి (బీఆర్ఎస్) నాలుగో సెట్, దొంతి మాధవరెడ్డి (కాంగ్రెస్) నాలుగో సెట్, ఇమ్మడి చిన్నికృష్ణ (స్వతంత్ర), బోడ అనిల్‌కుమార్ (స్వతంత్ర), కంభంపాటి పుల్లారావు (బీజేపీ) రెండు సెట్లు, గోనె యువరాజు (స్వతంత్ర), గుండెబోయిన రమేష్ (స్వతంత్ర), అర్షియాషేక్ (స్వతంత్ర), ఉండ్రాతి వీరస్వామి (భారత్ చైతన్య యువజన పార్టీ) తదితరులు చివరి రోజు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 39 నామినేషన్లు దాఖలయ్యాయి.



వర్ధన్నపేట : నామినేషన్ వేస్తున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొండేటి శ్రీధర్

వర్ధన్నపేటలో..

వర్ధన్నపేటలో గురువారం వరకు 19 నామినేషన్లు, శుక్రవారం 21 నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 26 మంది అభ్యర్థులు 40 నామినేషన్లు వేశారు. ప్రధాన పార్టీల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేష్, కాంగ్రెస్ అభ్యర్థిగా కేఆర్ నాగరాజు, బీజేపీ అభ్యర్థి కొండేటి శ్రీధర్, బీఎస్పీ అభ్యర్థి డాక్టర్ వడ్డేపల్లి విజయ్‌కుమార్ ఉన్నారు. మిగిలిన 22 మందిలో చిన్నపార్టీల అభ్యర్థులతోపాటు స్వతంత్రులు ఉన్నారు.



వరంగల్ అర్బన్: నామినేషన్ వేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నన్నపునేని నరేందర్



వరంగల్ అర్బన్ : ఆర్‌ఓ షేక్ రిజ్వాన్ బాషాకు నామినేషన్ అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

వరంగల్ తూర్పులో..

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయంలో వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులు చివరి రోజు భారీగా నామినేషన్లు వేశారు. ఆయా పార్టీలకు చెందిన వారితోపాటు స్వతంత్రులు 14 మంది 21 సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. మొత్తం 38 మంది అభ్యర్థులు 51 నామినేషన్లను దాఖలు చేశారు. నన్నపునేని నరేందర్ (బీఆర్ఎస్), కొండా సురేఖ (కాంగ్రెస్), ఎర్రబెల్లి ప్రదీప్‌రావు (బీజేపీ), పుష్పిత లయ (బీఎస్పీ), త్రిపురోజు రవికుమార్ (ఆమ్ ఆద్మీ), అలకాపల్లి కిశోర్ (సమాజ్‌వాది పార్టీ), సుంచు జగదీశ్వర్ (ఎంసీపీఐయూ), ఉజ్జిగిరి కమలాకర్ (విద్యార్థుల రాజకీయ), కేడల ప్రసాద్ (ధర్మసమాజ్), కొటం రవీందర్ (అలయన్స్ డెమొక్రటిక్ రీఫామ్స్) నామినేషన్లు సమర్పించారు. మహ్మద్ నసీరొద్దీన్ (ఆజాద్ సమాజ్), బైరి వంశీకృష్ణ (యుగ తులసి), స్వతంత్ర అభ్యర్థులు చింతల అనిల్, భవంతుల రాధిక, బొల్ల రామకృష్ణ, జన్ను పరంజ్యోతి, సాదా ప్రదీప్, పూసల శ్రీకాంత్, జోగు శ్వేత, కుడికాల రాధాకృష్ణ, కమిలికార్ రంజిత్ కుమార్, పోలెపాక చంద్రకళ, వన్నాల శ్రీనివాస్ తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారి షేక్‌రిజ్వాన్‌బాషాకు అందజేశారు. అంతేకాకుండా కాంగ్రెస్ తరఫున కొండా మురళీధర్‌రావు, బీజేపీ తరఫున ఎర్రబెల్లి రేణుక డమ్మీ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు.

అధికారులకు సూచనలు చేస్తున్న పోలీస్ అబ్జర్వర్ రాజేష్‌కుమార్



ఆర్డీఓ కార్యాలయం, స్ట్రాంగ్ రూం తనిఖీ

నర్సంపేట : పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం, మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్ రూంను పోలీస్ అబ్జర్వర్ రాజేష్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం స్ట్రాంగ్ రూంలో ఏర్పాట్లు బాగున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో నర్సంపేట రిటర్నింగ్ అధికారి కృష్ణవేణి అబ్జర్వర్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూం నిర్వహణపై ఆరోక్వు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏసీపీ తిరుమల్, ఏఆర్వో విశ్వప్రసాద్, సీఐలు కిషన్, రవీందర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓ కార్యాలయం పరిశీలన



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న షణ్ముఘరాజన్

వర్ధన్నపేట : వర్ధన్నపేట రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని జిల్లా ఎన్నికల అబ్జర్వర్ షణ్ముఘరాజన్ శుక్రవారం సందర్శించారు. నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేస్తున్నారా, తగిన సహాయ సహకారాలు హెల్ప్‌డెస్క్ ద్వారా అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థుల వెంట ప్రతిపాదిత వ్యక్తులు వస్తున్నారా అని అడిగారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం

- కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝాతో కలిసి కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు షణ్ముఘరాజన్, పోలీసు పరిశీలకుడు రాజేష్‌కుమార్, వ్యయ పరిశీలకుడు అమిత్‌ప్రతాప్‌సింగ్‌కు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలోని వర్ధన్నపేట, వరంగల్ తూర్పు, నర్సంపేట నియోజకవర్గాల్లో 791 పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించి, ఎన్నికల సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్‌తోపాటు 4,311 మంది పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 10 ఎఫ్ఎస్టీ, 9 ఎస్ఎస్‌టీ, 8 వీఎస్‌టీ బృందాలతో నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రూ.82 కోట్ల 7 లక్షల 520 సీజ్ చేశామని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా 250, వాట్సాప్ ద్వారా 5, సీవిజిల్ యాప్ ద్వారా 56, సోషల్ మీడియా ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించామని వివరించారు. ఆర్‌ఓలు రిజ్వాన్ బాషా, అశ్వినితానాజీ, ఎన్నికల నోడల్ అధికారులు, పర్యవేక్షకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.



ఎన్నికల పరిశీలకుల సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు

వరంగల్ నగరంలో ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఓటింగ్ శాతం పెంచేందుకు కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద సీపీ, కేంద్ర ఎన్నికల పరిశీలకులతో కలిసి కలెక్టర్ సెల్ఫీ పాయింట్ ఫొటోలు దిగారు.

ఎన్నికల పరిశీలకులను సంప్రదించవచ్చు..

ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, అభ్యర్థులు ఎన్నికల పరిశీలకులను కలిసి ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. వర్ధన్నపేట, నర్సంపేట, తూర్పు నియోజకవర్గాలకు ఎన్నికల సాధారణ పరిశీలకుడిగా షణ్ముఖరాజన్ (6302262778), వ్యయ పరిశీలకుడిగా అమిత్‌ప్రతాప్‌సింగ్ (9390441371)కు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. పరిశీలకులను నిట్ అతిథి గృహంలో ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల సమయంలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

చాంబర్ ఎన్నికలకు బ్రేక్..!

- దిడ్డి కుమారస్వామి నామినేషన్ తిరస్కరణ
- స్టేటస్‌కో జారీ చేసిన జిల్లా న్యాయస్థానం
- ఈనెల24వరకు ప్రక్రియ నిలిపివేత

వరంగల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఎన్నికల ప్రక్రియ అయోమయంలో పడింది. ఇటీవల నిర్వహించిన చాంబర్ ఈసీ, జనరల్ బాడీ సమావేశాల్లో కొత్తగా మూడు నిబంధనలు ప్రవేశపెట్టి బైలాలో చేర్చారు. అందులో ఒకటి ప్రజాప్రతినిధిగా కొనసాగుతున్న ఏవ్యక్తి అయినా చాంబర్ ఎన్నికల్లో పోటీ చేస్తే అనర్హునిగా పరిగణిస్తారు. రెండో చాంబర్ పాలకవర్గానికి మూడేళ్ల కాలపరిమితి, మూడోది ఒక వ్యక్తి మూడు పర్యాయాల కంటే ఎక్కువ అధ్యక్షునిగా ఉండకూడదు. ఈనిబంధనలను నిలిపివేయాలని చాంబర్‌కు చెందిన దేశబత్తుల రమేష్‌బాబు, కంచె సంపత్ జిల్లా కోర్టును శుక్రవారం ఆశ్రయించారు. దీంతో ఈనెల 24వ తేదీ వరకు స్టేటస్‌కోను వర్తింపజేస్తూ జిల్లా న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఎన్నికల ప్రక్రియ నిలిపివేసేందుకు కోర్టును ఆశ్రయించడంపై వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయం

డీకే నామినేషన్ తిరస్కరణ

9వ తేదీన 34వ డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి(డీకే)అధ్యక్ష పదవికి నామినేషన్ వేశారు. కార్పొరేటర్‌గా కొనసాగుతున్నందున కొత్తగా వచ్చిన నిబంధన ప్రకారం డీకే నామినేషన్‌ను ఎన్నికల అధికారి తిరస్కరించారు. 9వ తేదీన నామినేషన్లు దాఖలు చేసిన వారిలో అధ్యక్ష స్థానానికి దాఖలు చేసిన డీకే, సంయుక్త కార్యదర్శి స్థానానికి పోటీ చేసిన నల్లా సాంబయ్యల నామినేషన్లు తిరస్కరణకు గురి కాగా మిగిలిన నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల అధికారి జాబితాలో పేర్కొన్నారు.

అమలులో కొత్త నిబంధనలు

వరంగల్ చాంబర్ ఎన్నికలపై జిల్లా న్యాయస్థానం స్టేటస్‌కో జారీ చేయడంతో 24వ తేదీ వరకు ఈ ప్రక్రియకు బ్రేక్ పడనుంది. 9వ తేదీన నామినేషన్లు పూర్తి కాగా 10వ తేదీన జరిగిన స్క్రూటినీలో డీకే నామినేషన్ తిరస్కరించడం, ఎన్నికల ప్రక్రియపై కోర్టు స్టేటస్ కో జారీ చేయడంతో ప్రక్రియ కొన్ని రోజుల పాటు వాయిదా పడనుంది. ప్రస్తుత ఎన్నికల ప్రక్రియను యథాతథంగా 24 వరకు నిలిపివేస్తూ స్టేటస్‌కో కోర్టు జారీ చేయడంతో ఉత్తర్వులు జారీ అయ్యాయి. చాంబర్ బైలాలో అమలులోకి వచ్చిన కొత్త నిబంధనలు జనరల్ బాడీ మీటింగ్‌లో ఆమోదం పొందినందున వాటిని అమలు చేస్తారని తెలిసింది.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి

కాశీబుగ్గ సెంటర్ : సృజనాత్మకత, సమస్యల పరిష్కార సామర్థ్యాలను పెంపొందించేందుకు పాఠశాల విద్యార్థులను బాలశాస్త్రవేత్తలుగా తయారు చేసేది సైన్స్ కాంగ్రెస్ అని డీఈఓ వాసంతి అన్నారు. వరంగల్‌లో 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లాస్థాయి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఆరోగ్యం, శ్రేయస్సు కోసం ఆవరణ వ్యవస్థ అనే ప్రధాన అంశంతో సైన్స్ కాంగ్రెస్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఈసారి 104 ప్రాజెక్టులు ప్రదర్శనకు వచ్చాయని వెల్లడించారు. వాటి నుంచి నాలుగు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని చెప్పారు. గొప్ప సంస్కృతికి వారసులుగా ఉన్నందుకు మనం గర్వపడాలని అన్నారు. విద్యార్థులు నోబెల్ బహుమతి సాధించగల భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు, ప్రతిభ కనబర్చిన ఇతర విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంస పత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, డీసీఈబీ కార్యదర్శి జి.కృష్ణమూర్తి, సురేష్ బాబు, కృష్ణరాం గోపాల్, కిరణ్, గైడ్ టీచర్లు శ్రవణ్, రాజు, ధనలక్ష్మి, వాసు, పరమేశ్వర పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేసిన డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్

ఉమ్మడి జిల్లాలో 10 సీట్లు బీజేపీవే..

- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్

హన్మకొండ: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారు అని, ఉమ్మడి జిల్లాలో 10 సీట్లలో బీజేపీ విజయం సాధిస్తుందని కేంద్ర సమాచార, యువజన, క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ విద్యుత్ నగర్‌లోని బీజేపీ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ విస్మరించారని, యువతకు ఉద్యోగాలివ్వకుండా మోసం చేశారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వంతోనే తెలంగాణ అభివృద్ధి సాధిస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు దేశిని సదానందంగౌడ్, కొలను సంతోష్‌రెడ్డి, గుజ్జుల వసంత, గైనేని రాజన్, మాచర్ల కుమారస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్

రాయపర్తి : ప్రభుత్వ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్ కోరారు. మండల కేంద్రంలో జాంబవ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తేనే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి గుమ్మడి వీరభద్రం, ఏఈఓలు రాజేష్, శిరీష, జాంబవ సంస్థ చైర్మన్ ఐత బ్రహ్మం, డీడ్స్ సంస్థ అధ్యక్షురాలు సుల్తానా, జాంబవ సంస్థ ఇన్‌చార్జి వళపాక సుధాకర్, రైతులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఏఓ ఉషాదయాళ్

నేడు తెలంగాణ పీపుల్స్ జేఏసీ సమావేశం

హన్మకొండ: 'రాష్ట్రంలో పదేళ్ల పాలన, ప్రజల ఆకాంక్షలు-కర్తవ్యాలు' అంశంపై తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ తెలిపారు. హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సదస్సు జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, తెలంగాణ పీపుల్స్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని వీరితో పాటు పలువురు మేధావులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

'తూర్పు'లో బీఆర్ఎస్‌కు షాక్..

- పలువురు కార్పొరేటర్లు, నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు నిర్ణయం
- శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చేరిన వైనం

వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఎన్నికల ముంగిట అధికార పార్టీ అభ్యర్థికి ఎదురు దెబ్బ తగలనుందా.. ఆయన అభ్యర్థిత్వం నచ్చని కొందరు కార్పొరేటర్లు, ద్వితీయ శ్రేణి నేతలు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారా.. అంటే జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అవుననే సమాధానం వస్తోంది. అసంతృప్త నేతలందరూ ఇప్పటికే రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. సీఎం కేసీఆర్ టికెట్లు ప్రకటించినప్పటి నుంచి తూర్పు అభ్యర్థి నన్నపునేని నరేందర్‌ను మార్చాలని అదే పార్టీకి చెందిన అసంతృప్త నేతలు, కొంత మంది కార్పొరేటర్లు ప్రత్యేక సమావేశాలు పెట్టిన విషయం తెలిసిందే. అధిష్టానం సూచనల మేరకు ఎమ్మెల్యే వారిని కొంతమేరకు సంతృప్తి పర్చినట్లు తెలిసింది. రాంకీలో ఉంటున్న పరకాల నియోజకవర్గానికి చెందిన నాయకుడు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న విషయం బయటకు పొక్కడంతో ఆయన వద్దకు వెళ్లి మంతనాలు జరిపినట్లు సమాచారం. అదే విధంగా తూర్పులోని సెకండ్ కేడర్ నేతలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్న సమాచారం పొక్కడమే ఆలస్యం అధికార పార్టీకి చెందిన బ్యాచ్ వెళ్లి మంతనాలు చేస్తూ ఆర్థిక ప్యాకేజీలు ప్రకటిస్తుండడంతో చేరికలు నిలిచిపోతున్నాయి. కాంగ్రెస్ నుంచి తూర్పులో పోటీ చేస్తున్న అభ్యర్థికి చెందిన ముఖ్యనేత అసంతృప్తుల వద్దకు వెళ్లి వారికి భారీగా ప్యాకేజీలు ప్రకటించడంతో పార్టీలో చేరేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు రంగశాయిపేట, కాశిబుగ్గ, మట్టెవాడ, చింతల్, ఎల్బీనగర్‌లకు చెందిన కొంతమంది కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కీలక నేతలు, డివిజన్ స్థాయి నాయకులు కాంగ్రెస్ కండువాలు కప్పుకునేందుకు హైదరాబాద్‌కు వెళ్లినట్లు వాట్సాప్‌లో వైరల్ కావడం తూర్పులో హాట్ టాపిక్‌గా మారింది.



విజయవంతమైన ప్రజాస్వామ్యం వెనుక తప్పకుండా అహింస ఉంటుంది.
– మహాత్మాగాంధీ

ఈ ముచ్చటెరికేనా ?

ఆనాడు 21ఏళ్లు ఉంటేనే ఓటు హక్కు

కాజీపేట: దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన రోజుల్లో ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయాలంటే 21 సంవత్సరాల వయస్సు ఉండాల్సిందే. అంత కన్నా తక్కువ వయస్సు వారికి ఓటు హక్కు ఉండేది కాదు. 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా 18 ఏళ్లకు తగ్గించారు. అప్పటి నుంచి నేటి వరకు అదే విధానం కొనసాగుతుంది.

నియోజకవర్గాల వారీగా దాఖలైన నామినేషన్ల వివరాలు (తేదీ : 10-11-2023 వరకు)

నియోజకవర్గం	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ	ఇతరులు
వరంగల్ తూర్పు	02	02	04	39
వరంగల్ పశ్చిమ	01	07	04	51
జనగామ	02	02	02	41
పాలకుర్తి	06	04	02	42
స్టేషన్‌ఘన్‌పూర్	02	03	02	37
జేఎస్.భూపాలపల్లి	04	02	02	36
ములుగు	05	04	02	16
నర్సంపేట	04	04	04	27
వర్ధన్నపేట	04	04	04	28
పరకాల	02	02	04	47
మహబూబాబాద్	04	04	02	30
డోర్నకల్	01	01	01	28

వేధిస్తున్న వరద ముంపు

- వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ప్రధాన సమస్య
- భారీ వర్షాలతో ముంపునకు గురవుతున్న కాలనీలు
- అసంపూర్తిగా కాజీపేట ఆర్‌ఓబీ

గ్రౌండ్ రిపోర్ట్ – వరంగల్ పశ్చిమ

హన్మకొండ: వరంగల్ మహానగరంలోని ట్రై సిటీలో రెండు నగరాలు హనుమకొండ, కాజీపేట ప్రాంతాలు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోనే ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో వానాకాలం వచ్చిందంటే ఎప్పుడు తమ కాలనీ ముంపునకు గురవుతుందోనని జనం ఆందోళనలో గడపాల్సిందే.. ఏళ్లుగా ఈ సమస్య ప్రజలను పీడిస్తున్నా నాయకులు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో నీళ్లలోనే ప్రజలు జీవితాలు వెళ్లదీయాల్సిన దుస్థితి. నాలాల ఆక్రమణతో ముంపు సమస్య తలెత్తుతుందని అధికారులు, నాయకులు చెబుతున్నా దీనిపై చర్యలు తీసుకున్న దాఖలాలు కన్పించవు. హనుమకొండలోని ఇంజనీర్స్ కాలనీ, అశోక కాలనీ, గోకుల్‌నగర్, రాజాజి నగర్, నెహ్రూ నగర్, కిషన్ పుర, నాగేంద్ర నగర్, ప్రగతి నగర్, రామకృష్ణ కాలనీ, ప్రగతి నగర్–2 కాలనీలు వరద నీటితో ముంపునకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌కి వరదనీరు చేరడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. కొత్త బస్టాండ్ రోడ్ నుంచి మచిలీబజార్ మీదుగా అలంకార్ జంక్షన్‌కు వెళ్లే దారి చిన్నపాటి వానకే నదిని తలపిస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు కాజీపేట అభివృద్ధికి సరైన నిధులు మంజూరు చేయించడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పురాతన వంతెనతో కాలనీల మునక

నయీంనగర్ పెద్ద మోరి (నాలా)పై నిర్మించిన పురాతన వంతెన ప్రస్తుతం కాలనీల ముంపునకు కారణమవుతుంది. ఈ వంతెనలో నీరు వెళ్లేందుకు వేసిన పైపుల పరిమాణం తక్కువగా ఉండడంతో బ్యాక్ వాటర్‌తో కాలనీలు ముంపుకు గురవుతున్నాయి. ఇక్కడ వంతెన నిర్మించడానికి రూ.15 కోట్ల నిధులు మంజూరై రెండేళ్లవుతున్నా పనులు చేపట్టకపోవడంతోపై నగర వాసులు మండిపడుతున్నారు.

- హనుమకొండ అమృత థియేటర్ నుంచి రాయపుర వరకు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేపట్టి ఆరు సంవత్సరాలు గడుస్తున్న పూర్తి కాలేదు.
- నియోజకవర్గంలో కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నా.. మహానగర పాలక సంస్థ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.
- వరంగల్ మహానగరం స్మార్ట్ సిటీ కింద ఎంపికైనా ఇంకా నగరం పూర్తిగా సుందరీకరణకు నోచుకోలేకపోయింది. చిరువ్యాపారుల కోసం ప్రత్యేకంగా వెండింగ్ జోన్‌లు ఏర్పాటు చేసినా ప్రధాన రహదారుల వెంట వ్యాపారాలు చేస్తుండడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.
- ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయకపోవడం, కొన్ని కూడళ్లలో పని చేయకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయి.
- హనుమకొండలోని ఎన్జీవోస్ కాలనీ 100 ఫీట్ల రోడ్డు గోపాల్‌పూర్ చెరువు బ్రిడ్జి ప్రాంతం, బొక్కలగడ్డ, ఈద్గా, పెద్దమ్మ గడ్డ రోడ్డుతోపాటు పలు ఇంతర ప్రాంతాల్లో జంతు వ్యర్థాలు ఇష్టం వచ్చినట్లు పడేస్తున్నా నియంత్రించడంలో అధికారులు, పాలకులు పూర్తిగా విఫలమయ్యారు.
- హనుమకొండ– కాజీపేట ప్రాంతాల వారధి ఫాతిమా నగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. సీఎం కేసీఆర్ ఏడున్నర ఏళ్ల కిందట పనులు ప్రారంభించినా నేటికీ అసంపూర్తిగానే మిగిలిపోవడం గమనార్హం.
- నగర ప్రజల దాహార్తి తీరుస్తున్న వడ్డెపల్లి చెరువు నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో కాజీపేట పట్టణంలోని పలు కాలనీల ఇళ్లలో ఉపయోగించిన వ్యర్థ జలాలు నేరుగా రిజర్వాయర్‌లోకే చేరుతున్నాయి. దీంతో తాగునీరు కలుషితం అవుతుంది. చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్న ప్రజాప్రతినిధులు, అధికారుల హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి.
- హనుమకొండ నగరం నుంచి అవతలి వైపు గ్రామాలకు వెళ్లేదారిలో రైల్వేలైన్‌తో కాజీపేట దర్గా వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో ఆర్‌ఓబీ నిర్మించాలని ప్రభుత్వం తలపెట్టింది. కానీ, ఇళ్ల కూల్చివేత సమస్యగా పరిణమించింది. ఈ క్రమంలో అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని స్థానికుల నుంచి డిమాండ్ వస్తుంది.
- నియోజకవర్గంలో హనుమకొండ అంబేద్కర్ కాలనీ, న్యూశాయంపేటలో డబుల్ ఇళ్లు నిర్మించినా.. పేదలకు కేటాయించకపోవడంతో గుడిసె వాసులు ముంపులో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి.


అమృత టాకీస్ నుంచి రాయపుర వరకు పెండింగ్‌లో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ


అసంపూర్తిగా ఉన్న ఆర్‌ఓబీ


నయీంనగర్ పెద్ద మోరిపై పురాతన వంతెన


వరద నీటిలో నెహ్రూనగర్ (ఫైల్)

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పర్చాలి



నగరంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి. స్మార్ట్‌సిటీగా ఎంపికై ఏళ్లు గడుస్తున్నా.. పనులు పూర్తి కాలేదు. మెట్రో రైల్, కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలి

– తిరునహరి శేషు, ప్రజా వేదిక చైర్మన్

సమస్యలు పరిష్కరించాలి



అమృత టాకీస్ నుంచి రాయపుర బ్రిడ్జి వరకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను దాదాపు ఆరు సంవత్సరాల క్రితం చేపట్టి, పూర్తి చేయలేదు. రోడ్డు నిర్మాణానికి కంకర, ఇసుక కుప్పలు పోసి వదిలేయడతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

– ముస్కు ప్రవీణ్, రాయపుర

హోర్డింగ్ కనిపించలేదా.. కోడ్ వర్తించదా..?


కాజీపేటలో తొలగించని హోర్డింగ్

వరంగల్ అర్బన్: రాష్ట్ర శాసన సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలై నెల రోజులు గడిచింది. అంతటా ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. కోడ్ వెలువడిన 48 గంటల్లో నగరమంతా జల్లెడ పట్టి రాజకీయ పార్టీలకు చెందిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, గోడపై రాతలు, పోస్టర్లు పార్టీ జెండాలు తొలగించినట్లు బల్దియా ఉన్నతధికారులు ప్రకటించారు. కానీ, కాజీపేట 61వ డివిజన్‌లోని ఫాతిమా కాంప్లెక్స్ ఎదురుగా సిద్ధార్థ నగర్‌లోని ఒక మాల్‌పై సీఎం కేసీఆర్ చిత్రంతో కూడిన భరోసా పథకానికి చెందిన హోర్డింగ్ బల్దియా అధికారులు, సిబ్బందికి కనిపించకపోవడం గమనార్హం. దీంతో ప్రధాన రహదారిపై అంత ఎత్తులో ఉన్న హోర్డింగ్ తొలగించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..

సెల్ఫీతో అవగాహన



వరంగల్ కలెక్టరేట్ ఆవరణలో సెల్ఫీపాయింట్ వద్ద ఫొటో దిగిన కలెక్టర్, పరిశీలకులు

వరంగల్ నగరంలో ఓటింగ్ శాతం పెంచేందుకు, యువ ఓటర్లలో చైతన్యం కల్పించేందుకు పాలన యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా వరంగల్ కలెక్టరేట్ ఆవరణలో సెల్ఫీ పాయింట్ ఏర్పాటుచేవారు. ఈ మేరకు శుక్రవారం సీపీ అంబర్ కిషోర్ ఝా, కేంద్ర ఎన్నికల పరిశీలకులతో కలిసి వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య సెల్ఫీ దిగారు. దీంతోపాటు ఎంజీఎం, రైల్వే స్టేషన్ వద్ద సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

– కరీమాబాద్

పరకాల అసెంబ్లీ బరిలో ‘గ్రీన్‌ఫీల్డ్’ బాధితులు

- నామినేషన్లు వేసిన 8 మంది రైతులు


నామినేషన్ వేసేందుకు ఆర్‌ఓ కార్యాలయానికి చేరుకున్న నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతులు

పరకాల: భూసేకరణలో కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడంతోపాటు పాలకులు తమకు మద్దతు తెలపకపోవడంతో నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతులు కొత్త తరహా ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. పరకాల అసెంబ్లీ స్థానానికి శుక్రవారం 8 మంది రైతులు నామినేషన్ వేయడం చర్చనీయాంశంగా మారింది. పరకాల డివిజన్‌లోని గ్రీన్‌ఫీల్డ్ హైవేలో వందలాది మంది రైతులు భూములు కోల్పోతున్న విషయం తెలిసిందే. తమ హక్కులను, అభిప్రాయాలను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ తమ భూములు స్వాధీనం చేసుకుంటుందన్న ఆందోళనతో పరకాల డివిజన్‌లోని 8 మంది రైతులు బూర్గుల రామచంద్ర రావు, బొల్లు రాజిరెడ్డి, నల్లెల సతీష్, అబ్బాడి రవీందర్ రెడ్డి, మంద సంధ్య, పెండ్లి జనార్దన్, గోనె రాజు, ఐలీ సాంబయ్య శుక్రవారం ఆకుపచ్చ కండువాలతో వచ్చి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


మనోహర్

ములుగు రూరల్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రాంనగర్ సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన దయ్యాల మనోహర్ (55) శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బడే నాగజ్యోతి నామినేషన్‌కు గ్రామస్తులతో కలిసి ములుగు జిల్లా కేంద్రానికి వచ్చాడు. నామినేషన్ ప్రక్రియ అనంతరం తిరుగు ప్రయాణంలో రాంనగర్ సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. దీంతో గమనించిన బాటసారులు మనోహర్‌ను ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. నామినేషన్ ప్రక్రియలో అపశృతి దొర్లడంతో పార్టీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మనోహర్‌కు భార్య రాధ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సంతోషం.. ఇంటికి చేరలేదు

- నిశ్చితార్థానికి వెళ్లి వస్తుండగా వాహనం బోల్తా
- ఒకరి మృతి.. నలుగురికి తీవ్రగాయాలు


లక్ష్మారెడ్డి (ఫైల్)

కాటారం: తమ కుమారుడి పెళ్లి సంబంధం కుదుర్చుకొని నిశ్చితార్థ కార్యక్రమం పూర్తి చేసుకొని తిరుగుపయనమైన వారి సంతోషం ఇల్లు చేరలేదు. ఆనందంగా ఉన్న ఆ కుటుంబాన్ని విధి వెక్కిరించింది.. దీంతో రోడ్డు ప్రమాదం రూపంలో వచ్చిన మృత్యువు ఆ కుటుంబ పెద్దను కబలించడంతో అంతా దుఃఖసాగరంలో మునిగారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల సరిహద్దు మేడిపల్లి అటవీప్రాంతంలో జాతీయ రహదారి(353సి)పై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవపూర్ మండలం బొమ్మాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బండం లక్ష్మారెడ్డి(48) తన కుమారుడు మనోహర్‌రెడ్డి పెళ్లి సంబంధం కుదుర్చుకోవడం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు వెళ్లారు. నిశ్చితార్థం పూర్తి చేసుకొని కుటుంబ సభ్యులతో కలిసి టాటా సఫారీ కారులో తిరుగు ప్రయాణమయ్యారు. భూపాలపల్లి కమలాపూర్ క్రాస్ రోడ్డు దాటి కాటారం సరిహద్దు మేడిపల్లి అటవీ ప్రాంతంలోకి వస్తున్న క్రమంలో వీరు ప్రయాణిస్తున్న వాహనానికి అడ్డుగా అటవీ జంతువు అకస్మాత్తుగా వచ్చింది. దీంతో డ్రైవర్ మనోహర్ జంతువును తప్పించబోయి కుడివైపునకు వాహనాన్ని తిప్పగా అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకుపోయి మైలురాయిని ఢీ కొని పల్టీకొట్టింది. ఈక్రమంలో బండం లక్ష్మారెడ్డి వాహనంలోనుంచి బయటపడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న బండం నాగేంద్ర, ప్రమీల, తోడె లక్ష్మి, చినాల సౌజన్య తీవ్రంగా, డ్రైవర్ మనోహర్ స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను అంబులెన్స్‌లో భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య బండం పుష్పలత మహదేవపూర్ వైస్ ఎంపీపీగా కొనసాగుతున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై–2 సురేశ్ తెలిపారు.

కుమారుడి ప్రేమను అంగీకరించి..

లక్ష్మారెడ్డి కుమారుడు మనోహర్‌రెడ్డి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈక్రమంలో ఓ అమ్మాయిని ప్రేమించిన విషయం కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. దీంతో ఎలాంటి ప్రతిఘటన లేకుండా కుమారుడి ఆనందమే తన ఆనందంగా భావించిన తల్లిదండ్రులు అతడి ప్రేమను అంగీకరించారు. ఈక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరుకు చెందిన ఆ అమ్మాయి తల్లిదండ్రులను సంప్రదించి గురువారం నిశ్చితార్థం చేసుకుని తిరిగివస్తూ.. రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈప్రమాదంలో లక్ష్మారెడ్డి ప్రాణాలు కోల్పోయాడు. కాగా, అమెరికా నుంచి కుమారుడు వచ్చిన అనంతరం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. రాజకీయంగా చురుగ్గా ఉంటూ.. రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా ఉన్న లక్ష్మారెడ్డి మృతితో మండలంలోని వివిధ పార్టీ నాయకులు నివాళులర్పించారు.

హత్య కేసు నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ డేవిడ్‌రాజ్

ధర్మసాగర్: నవంబర్ 7వ తేదీ రాత్రి హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని జానకిపురం గ్రామ శివారులో గండికోట లక్ష్మణ్‌ను హత్య చేసిన నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేసినట్లు కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జానకిపురం శివారులోని జామాయిల్ తోటలో షికారుకు వెళ్లిన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం, గోపాలపురం గ్రామానికి చెందిన గండికోట లక్ష్మణ్ (40)పై గొడ్డలితో దాడి చేసి హత్య చేశారు. ఈక్రమంలో నిందితులు సాయిపేట గ్రామానికి చెందిన దద్దు రాజయ్య, దద్దు మహేందర్‌ను ఎలుకుర్తి క్రాస్ రోడ్డు ఔటర్ రింగ్‌పై వాహనాలు తనిఖీ చేస్తుండగా ధర్మసాగర్ సీఐ శ్రీధర్ రావు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసిన వారిలో సీఐ శ్రీధర్ రావు, ఎస్సై ఫిలిప్ రాజ్ ఉన్నారు.

సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

- మహిళ శరీరం నుంచి కణితితొలగింపు


శస్త్రచికిత్స నిర్వహిస్తున్న వైద్యులు

ఎంజీఎం: కాకతీయ మెడికల్ కళాశాలలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో న్యూరోసర్జరీ విభాగంలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు పరిపాలనాధికారులు శుక్రవారం తెలిపారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేటకు చెందిన అనూష(30) తీవ్రమైన నడుము నొప్పితో ఆస్పత్రిలోని న్యూరోసర్జరీ విభాగానికి వచ్చింది. ఆమెను పరీక్షించిన డాక్టర్ నర్సింగరావు ఎంఆర్ఐ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి స్పైనల్ కార్డ్‌కు కణితి ఉన్న విషయాన్ని గుర్తించారు. దీంతో శుక్రవారం సుమారు నాలుగు గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించి కణితిని తొలగించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటువంటి శస్త్రచికిత్స నిర్వహించడం మొదటిసారి అని పేర్కొన్నారు. ఈ శస్త్రచికిత్స నిర్వహించిన డాక్టర్ నర్సింగరావు, కొత్తగట్టు శ్రీనివాసరావు, మత్తు వైద్యులు హన్మంతరావులను ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నోడల్ అధికారి గోపాల్‌రావు అభినందించారు.



ఆరోగ్య ధన ప్రాప్తిరస్తు!

ఇవాళ ధనత్రయోదశి. దీనినే ధన్ తేరస్ అని కూడా అంటారు. ఈ పర్వదినాన సాధారణంగా అందరికీ బంగారం, వెండి, గృహోపకరణాలు, వస్తు వాహనాల వంటి వాటి మీదికే దృష్టి మళ్లుతుంది. ఆరోగ్య ప్రదాత అయిన ధన్వంతరి జయంతి కూడా ఇదే రోజు అని గుర్తు రాదు. అయితే ఆరోగ్యం కూడా ధనమే కాబట్టి ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ఏం చేయాలో తెలుసుకుని అందుకు తగినట్లు నడుచుకుంటే ఆరోగ్య ధనం, ఆరోగ్య మహాభాగ్యం సమకూరుతుంది. ధన త్రయోదశి సందర్భంగా ఆరోగ్య సంపదను ఏవిధంగా పెంపొందించుకోవాలో చూద్దాం...

సంపూర్ణ ఆరోగ్యానికి ఆహార విహారాలు ఎంత అవసరమో, నిత్యం నడక, వ్యాయామం, యోగా కూడా అంతే అవసరం. ప్రధానంగా ఇవి అనేక రుగ్మతలకు దివ్య ఔషధాలు. అజీర్తి నుంచి ఆర్థరైటిస్ వరకు.. బీపీ నుంచి హార్ట్ఎటాక్ వరకు, మధుమేహం నుంచి మానసిక సమస్య వరకు ఏదైనా నయం కావాలంటే రోజూ వ్యాయామం, యోగా చేస్తుండాలి.

■ సమయానికి తగు...



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ పౌష్టికాహారాన్ని తీసుకోవడం ఎంత అవసరమో ఆ ఆహారాన్ని తగిన సమయానికి తీసుకోవడం కూడా అంతే అవసరం. వేళ తప్పి భోజనం చేస్తే అది మన ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. అందువల్ల ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సరైన సమయాలకు భోజనం చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

■ బ్రేక్ ఫాస్ట్ తప్పనిసరి

రోజూ ఉదయాన్నే టిఫిన్ చేయడం వల్ల ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండగలుగుతారు. కొందరికి అలా బ్రేక్ ఫాస్ట్ చేయడం అలవాటు ఉండదు. అలాంటి వారు అల్పాహారంగా నానబెట్టిన బాదం, ఎండు ద్రాక్ష, వాల్నట్స్, మొలకెత్తిన గింజలు, అవిసెలు, తాజాపండ్లు, కూరగాయల ముక్కలు లాంటివి అయినా తప్పనిసరిగా తీసుకోవాలి.



■ లంచ్‌గా ఇవి...

మధ్యాహ్నపు భోజనంగా సగం కంచంలో తాజా కూరగాయలు, మిగతా సగంలో పిండిపదార్థాలు, మాంసకృత్తులు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండేలా చూసుకోవాలి.



రక్తంలో చక్కెర నిల్వల్ని అదుపులో ఉంచుకోవడానికి, లో గ్లైసిమిక్ ఇండెక్స్ కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు లాంటి చిరుధాన్యాన్ని ప్రయత్నించవచ్చు.

ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత మేరకు తగ్గించాలి. ఎందుకంటే, మనం వాడే ప్లాస్టిక్ వస్తువుల నుండి, రోజుకి కొన్ని లక్షల సూక్ష్మరేణువులు విడుదలవుతాయి. వాటిలో ఉండే రసాయనం హార్మోన్ల సమతౌల్యాన్ని దెబ్బ తీస్తుంది.

■ మానసిక దృఢత్వం

మానసిక ఆరోగ్యం బాగుంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు. ఇందుకోసం నిత్యం నడక, వ్యాయామం, యోగా తప్పని సరి. ప్రధానంగా ఇవి అనేక రుగ్మతలకు దివ్య ఔషధాలు.

■ కంటినిండా నిద్ర

కడుపు నిండా తిని కంటి నిండా నిద్ర పోతే ఏ జబ్బూ ఉండదని పెద్దవాళ్లనేవారు. వేళకు తగినంత రాత్రి నిద్ర ఉంటే పొద్దున లేవగానే ఉత్సాహంగా ఉంటుంది. లేదంటే నిస్సత్తువగా... ఏదో పోగొట్టుకున్నట్లుగా అనిపిస్తుంది. నిద్ర లేమి వల్ల రకరకాల ఇతర జబ్బులు వస్తాయి. అందువల్ల వీలయినంత వరకు వయసును బట్టి, చేసే శారీరక శ్రమను అనుసరించి తగినంత నిద్ర పోవడం ప్రతి ఒక్కరికీ అవసరం.



ఈ ధన త్రయోదశి నాడు అందరూ ఆరోగ్య ధనాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తారని, వేయాలనీ ఆశిద్దాం.



మంచి కొవ్వు మంచిదే!

లావవుతామనే భయంతో చాలామంది కొవ్వు పదార్థాలు ఉండే ఆహారాలను తినడం మానేస్తున్నారు. కొందరైతే నెయ్యి తినడం ఎప్పుడో మానేశారు. అయితే శరీరంలోని ఎ, డి, ఇ, కె విటమిన్లు కొవ్వులో మాత్రమే కరుగుతాయి. కాబట్టి తగిన పరిమాణంలో మంచి కొలెస్ట్రాల్ ఎంతో అవసరం. అలాగని అన్నిరకాల కొవ్వులూ ఆరోగ్యం కాదు. ఇంతకూ ఆరోగ్యకరమైన కొవ్వు లభించాలంటే ఎలాంటి ఆహారాలు తీసుకోవాలో తెలుసుకుందామా?

మీరు ఆరోగ్యం పట్ల చాలా కాన్షియస్‌గా ఉండి..అధిక పరిమాణంలో కొలెస్ట్రాల్ ఉన్న ఆహారాలకు దూరంగా ఉంటే తప్పకుండా ఈ అవకాడోను ఆహారంలో చేర్చుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఉండే మోనోశాచురేటెడ్ కొవ్వు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించేందుకు కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

ఆలివ్ ఆయిల్: వేపుళ్లకు దూరంగా ఉండేవారు తప్పకుండా ఆహారాల్లో ఆలివ్ ఆయిల్‌ను తప్పకుండా వినియోగించాల్సి ఉంటుంది. ఇందులో ఉండే పోషకాలు, మోనోశాచురేటెడ్ కొవ్వులు గుండెను ఆరోగ్యంగా చేసేందుకు సహాయపడతాయి. అంతేకాకుండా శరీర బరువును నియంత్రించేందుకు కూడా సహాయపడతాయి.

పెరుగు: బరువు తగ్గడానికి ఆరోగ్యకరమైన ఆహారాలు తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా తీసుకుంటే శరీరంలోని కొవ్వును సమతుల్యంగా చేస్తుంది. కాబట్టి శరీరం ఆరోగ్యంగా ఉండడానికి తప్పకుండా కొవ్వు పాలతో చేసిన పెరుగు తినడం చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఇందులో ఉండే గుణాలు ప్రేగును కూడా ఆరోగ్యంగా ఉంచుతాయి.

కొబ్బరి: కొబ్బరి లేదా కొబ్బరి నూనె తీసుకోవడం వల్ల శరీరానికి అనేక రకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో జీర్ణక్రియను మెరుగుపరిచే చాలా రకాల పోషకాలు దొరుకుతాయి. దీనివల్ల ట్రైగ్లిజరైడ్ ఫుడ్ సులభంగా జీర్ణమవుతుంది. అంతేకాకుండా మలబద్ధకం, ఇతర పొట్ట సమస్యల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.

చేపలు: చేపలలో మంచి కొలెస్టరాల్‌ను పెంపొందించే లక్షణాలున్నాయి. అందుకే ఇతర విధాలైన మాంసాహారాలకు దూరంగా ఉండమని హెచ్చరించే వైద్యులు సైతం పరిమితంగా అయినా చేపలు తీసుకోవచ్చునని చెబుతారు.

బాదం పప్పు, జీడిపప్పు: వీటిని తీసుకోవడం వల్ల కొవ్వు పెరుగుతుందని అనుకుంటాం. అయితే వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు మాత్రమే ఉంటాయి. అందువల్ల బాదం, జీడిపప్పు తీసుకోవడం మంచిది. బాదం పప్పును నీటిలో నానబెట్టి, పైన పొట్టు తీసి తినడం మంచిది. జీడిపప్పును అయితే వేయించకుండా నేరుగా తీసుకోవడం వల్ల మంచి కొలెస్టరాల్ పెంపొందుతుంది.

నెయ్యి: ఇదివరకటిలో ఆహారంలో నేతిని బాగా ఉపయోగించేవారు. అరిసెలు, గారెలు వంటి వాటిని నేతితోనే చేసేవారు. అయితే రానురానూ నెయ్యి తినడం ఆరోగ్యానికి మంచిది కాదనే అభిప్రాయం స్థిరపడిపోయింది. నిజానికి నేతిలో శరీరానికి అవసరమైన పోషకాలెన్నో ఉన్నాయి. అలాగని ముద్ద ముద్దకీ నెయ్యి వేసుకోవడం, నేతితోనే చేసిన డీప్ ఫ్రైలు విపరీతంగా తీసుకోవడం మాత్రం అంత మంచిది కాదు. గేదె నెయ్యి కన్నా ఆవు నెయ్యి మంచిది.

మరకలను మాయం చెయ్యండి ఇలా...



బట్టలపై మరకలు పడ్డప్పుడు డ్రై క్లీనింగ్‌కి ఇద్దామంటే ఆ ధరకు కొత్తదే వస్తుందమే అనిపిస్తుంది. అయితే మరకలను తొలగించుకునేందుకు కొన్ని చిట్కాలున్నాయి. అవేమిటో చూద్దాం.

మీ దుస్తులు మెరిసేలా చేయాలంటే ఆస్పిరిన్ మాత్రలు బాగా ఉపయోగపడతాయి. ఆస్పిరిన్‌లో ఉండే ఎసిటైల్‌సాలిసిలిక్ ఆమ్లం బట్టలపై పడిన మరకలను తొలగించేందుకు సాయం చేస్తుంది. తెల్లని దుస్తులను నాలుగైదు ఆస్పిరిన్ టాబ్లెట్లు వేసిన నీళ్ల బకెట్‌లో బాగా నానబెట్టండి. తరవాత బట్టల సబ్బుతో ఉతకడమో లేదా వాషింగ్ మెషీన్‌లో వేసి మామూలుగా ఉతికి జాడించి ఆరేస్తే సరి!

రక్తపు మరకలను తొలగించడానికి.. ఆస్పిరిన్‌ను చల్లటి నీటిలో కరిగించి బట్టలను నానబెట్టండి. వేడినీటితో రక్తపు మరకలను తొలగించడానికి ప్రయత్నించవద్దు. ఇది ప్రోటీన్లు గడ్డకట్టడానికి కారణమవుతుంది. ఆ తరువాత మరకను తొలగించడం కష్టం అవుతుంది. చేస్తుంది.

నూనె, గ్రీజు మరకలకు

ఒక నిమ్మకాయను రెండు ముక్కలుగా కోయాలి. ఒక ముక్క మీద ఉప్పు వేసి మరకపై రుద్దాలి. ఇది నిమిషాల్లో బట్టలపై ఉన్న మరకలను తొలగిస్తుంది.

వక్కపొడి, పాన్ మసాలా మరకలు

పెరుగు లేదా మజ్జిగను మరక పడ్డ చోట ఉంచి పది నిమిషాలు అలాగే ఉంచండి. తర్వాత శుభ్రమైన నీటితో వస్త్రాన్ని కడగాలి. ఇది బట్టలపై ఉన్న మరకలను తొలగిస్తుంది.

టీ–కాఫీ మరకలు

టీ–కాఫీ మరకలు పడ్డప్పుడు ముందుగా గోరువెచ్చటి నీటిలో ఆ వస్త్రాన్ని పదిహేను నిమిషాలు ఉంచిన తర్వాత లిక్విడ్ డిటర్జెంట్లో నానబెట్టాలి. తర్వాత మరక పడ్డ చోట చేతితో రుద్దితే మరకలు తొలగుతాయి.

టర్కీ టవళ్లు, దుప్పట్ల వంటి వాటిని బట్టలుతికే సోడా కలిపిన నీటిలో నానబెట్టి ఉతికితే త్వరగా శుభ్ర పడతాయి.

సినిమా



● బెల్లం దుర్గ, దేవినేని అవినాష్, ఘట్టమనేని బాబీ, కమల్‌హాసన్

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఆవిష్కరించారు. విజయవాడలోని గురునానక్ కాలనీ కేడీజీఓ పార్కులో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 'భారతీయుడు 2' చిత్రం షూటింగ్ కోసం విజయవాడలో ఉన్న కమల్‌హాసన్.. కృష్ణ–మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆహ్వానం మేరకు కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది'' అన్నారు కమల్‌హాసన్. ఈ విగ్రహావిష్కరణలో పాల్గొన్న విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ– ''కళామతల్లికి తనదైన శైలిలో సేవలందించి, ప్రేక్షకుల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు కృష్ణగారు. తండ్రి గౌరవాన్ని మహేశ్‌బాబుగారు నిలబెడుతున్నారు'' అన్నారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణ కేవలం పదిరోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు సహకరించిన సీఎం జగన్ మోహన్ రెడ్డిగారికి కృతజ్ఞతలు'' అని కృష్ణ అభిమానుల సంఘం పేర్కొంది. ఈ కార్యక్రమంలో విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కృష్ణ కుటుంబ సభ్యుడు ఘట్టమనేని బాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గల్లా పద్మావతి, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

గర్వంగా ఉంది: హీరో మహేశ్‌బాబు

''నాన్నగారి విగ్రహాన్ని ఆవిష్కరించిన కమల్ హాసన్‌గారికి కృతజ్ఞతలు. నాన్నగారు వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, వారసత్వానికి ఇదొక నివాళి. నాన్న విగ్రహం ఏర్పాటుకు కారణమైన అందరికీ, ఈ వేడుక ఘనంగా నిర్వహించిన అభిమానులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు'' అంటూ ట్వీట్ చేశారు మహేశ్ బాబు.



● కాజల్

వేటాడే సత్యభామ

'సత్యా.. ఈ కేసు నీ చేతుల్లో లేదు (ప్రకాశ్‌రాజ్).. కానీ ఆ ప్రాణం నా చేతుల్లోనే పోయింది సార్ (కాజల్ అగర్వాల్)' అనే డైలాగ్స్‌తో మొదలవుతుంది 'సత్యభామ' టీజర్. పోలీసాఫీసర్ సత్యభామ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం ఇది. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్‌ప్లే అందించారు. శుక్రవారం 'సత్యభామ' టీజర్‌ను రిలీజ్ చేశారు. 'సార్.. ఆ గిల్ట్ నన్ను వెంటాడుతూనే ఉంది. వేటాడాలి (కాజల్ అగర్వాల్)', 'ఆ అమ్మాయి చావుకు మీరే కారణం అంటున్నారు. ఈ కేసును మీరు వదిలేసినట్లేనా? (విలేకర్లు).. నెవర్ (కాజల్)' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల.



● ధనుష్, ఇళయరాజా

ఇళయరాజా బయోపిక్‌లో ధనుష్

సంగీత జ్ఞాని ఇళయరాజా జీవితం వెండితెరపైకి రానుంది. ఇందులో ధనుష్ ఓ ప్రధాన పాత్రలో నటించనున్నారు. మెర్క్యూరీ గ్రూప్, కనెక్ట్ మీడియా సంస్థలు ఈ బయోపిక్‌ను నిర్మించనున్నాయి. వచ్చే ఏడాది అక్టోబరులో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించి, 2025 ఏడాది మధ్యలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా మెర్క్యూరీ గ్రూప్ సీఈవో, ఎండీ శ్రీరామ్ భక్తి శరణ్ మాట్లాడుతూ –''ప్రాంతీయ కథలతో సినిమాలు తీస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. అందుకే లోకల్, ప్రాంతీయ కథలను అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కించాలనుకుంటున్నాం'' అన్నారు. ''రాబోయే రెండు దశాబ్దాల్లో భారతీయ వినోద పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రపంచ వినోద పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన మెర్క్యూరి సంస్థతో మెగా బడ్జెట్ సినిమాలను నిర్మించడానికి వారితో చేతులు కలపడం మాకు సంతోషంగా ఉంది'' అని కనెక్ట్ మీడియా ప్రతినిధి వరుణ్ మాథుర్ అన్నారు.

కొత్తవాళ్లతో సినిమా పెద్ద బాధ్యత - నిహారిక



● యూనిట్‌కి స్క్రిప్ట్ అందిస్తున్న అల్లు అరవింద్

''**మా** పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో ఇప్పటివరకు వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలింస్ చేశాం. తొలిసారి ఫీచర్ ఫిల్మ్ ప్రారంభించాం. ఇంతమంది కొత్తవాళ్లతో సినిమా చేయటం పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను'' అన్నారు నిహారిక కొణిదెల. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్న చిత్రం శుక్రవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు నాగబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో వరుణ్ తేజ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. యదు వంశీ మాట్లాడుతూ– ''ఈ సినిమా ద్వారా 11 మందిని హీరోలుగా, నలుగురిని హీరోయిన్లుగా పరిచయం చేస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రంతో నేను, నా సతీమణి జయలక్ష్మి నిర్మాతలుగా పరిచయమవుతున్నాం'' అన్నారు శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ అధినేత ఫణి. ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎదురోలు, సంగీతం: అనుదీప్ దేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్.



● రాహుల్, శివానీ, మిథున్, తేజా మార్ని, 'బన్నీ' వాసు, విద్య

లింగి లింగిడి..!

శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల అవుతోంది. రంజిన్ రాజ్, మిథున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగిడి..' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేయగా, 30 మిలియన్ వ్యూస్‌ను పూర్తి చేసుకుంది. ''ఈ పాటలానే మా చిత్రానికి ప్రేక్షకులు విజయం అందిస్తారనే నమ్మకం ఉంది'' అని హైదరాబాద్‌లో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో 'బన్నీ' వాసు అన్నారు.

ప్రేమలో గీతాశంకరం



● ప్రియాంక, ముఖేష్ గౌడ

ముఖేష్ గౌడ, ప్రియాంకా శర్మ జంటగా కె.దేవానంద్ నిర్మిస్తున్న ప్రేమకథా చిత్రం 'గీతా శంకరం'. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ మాట్లాడుతూ– ''సీరియల్స్‌లో పేరు సంపాదించుకున్నట్లే ఈ సినిమాతో వెండితెరపై కూడా మంచి పేరు తెచ్చుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. ''నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర లభించడం నా లక్‌గా భావిస్తున్నా'' అన్నారు ప్రియాంకా శర్మ. ''ఇరవై కథలు విన్నాం. కానీ రుద్ర చెప్పిన ఈ కథ నచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. ఈ నెల 14న కొత్త షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు దేవానంద్. ''ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు రుద్ర. ఈ చిత్రానికి సంగీతం: అబు, కెమెరా: ఉదయ్ ఆకుల.



● జాన్వీ కపూర్

రెండు హృదయాల కల

'రూహి' చిత్రం తర్వాత రాజ్ కుమార్ రావు, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. 'నో డ్రీమ్ ఈజ్ ఎవర్ చేజ్డ్ ఎలోన్!' అనేది క్యాప్షన్. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్‌కు శరణ్‌శర్మ దర్శకత్వం వహించగా, కరణ్ జోహార్ నిర్మించారు. ''ఒకే కల కోసం రెండు హృదయాలు ఎదురు చుస్తున్నాయి'' అంటూ ఈ మూవీని ఏప్రిల్ 19న రిలీజ్ చేయనున్నట్లుగా జాన్వీ కపూర్ అండ్ టీమ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.



● సోహైల్

మాస్ రింగు...

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్– కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్నారు. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'రింగు రింగు బిళ్ల..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకి దేవ్ పవార్ సాహిత్యం అందించగా, భోలే షావలి, రఘురామ్ పాడారు. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ''ఫుల్ మాస్‌గా 'రింగు రింగు బిళ్ల..' సాంగ్ ఉంటుంది. సోహైల్ చేసిన మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు మేకర్స్.

సరికొత్త ట్రయల్



● 'ది ట్రయల్' పోస్టర్

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది ట్రయల్'. స్మృతి సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ''ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని కంప్లీట్ ఇంటరాగేటివ్ కథతో, సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఈ సినిమా కథనం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సహనిర్మాత: సుదర్శన్ రెడ్డి.

మంచి సినిమా అంటున్నారు - నిర్మాత సాయి సుధాకర్



''అలా నిన్ను చేరి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి ఎక్కువగా స్పందన వస్తోంది. వారంతా ఫస్ట్ హాఫ్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు'' అని కొమ్మాలపాటి సాయి సుధాకర్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ–''మా సినిమా చూసిన చాలామంది తమ జీవితాన్ని చూసుకున్నట్టుగా ఉందనడం సంతోషం. 'అలా నిన్ను చేరి' నిర్మాతగా మొదటి సినిమా అయినా కథకి అవసరం మేరకు ఖర్చు పెట్టా. సినిమా చూసిన మా నాన్నగారు బాగా తీశారని మెచ్చుకున్నారు. నా తర్వాతి సినిమా కోసం ప్రస్తుతం థ్రిల్లర్ జానర్‌లో ఓ కథ విన్నాను'' అన్నారు.